కథ

# నా...నీ...

- గోగినేని మణి

## నా...

ఈ ఒక్క అక్షరం రాశాక, ఆ పిలుపును ఎలా పూర్తిచేయాలో తోచని తికమకతో ఖాళీని అలాగే వదిలి ఉత్తరాన్ని కొనసాగిస్తున్నా. ఈ ఉత్తరం చదివాక మీ నిర్ణయాన్నిబట్టి ఆ ఖాళీని తదుపరి ఉత్తరంలో పూర్తిచేయగలనని అనుకుంటున్నాను మరి.

నేనెవరూ, ఎందుకీ ఉత్తరం రాస్తున్నానూ లాంటి సందేహాలెన్నో మీ మనసులో మొలకెత్తి ఉంటాయని గ్రహించి, ఆలస్యం చేయకుండా వివరాల్లోకి వెళ్తున్నాలెండి... నా పేరు... అదంత ముఖ్యమైన విషయం కాదు... ముందు ముందు ఎలానూ తెలుస్తుంది. ఇక చదువూ ఉద్యోగమూ లాంటి వివరాలంటారా... అవీ అంతే... ముందు ముందుకి డిటోయే..! అలా అన్నీ ముందుముందే తెలిస్తే, ఇపుడు చెప్పొచ్చేదేమిటీ అని నిలదీస్తున్నారా..? చెప్పాల్సిన ముఖ్యమైన సంగతులూ ఉన్నాయిలెండి.

మా నాన్న ఉద్యోగరీత్యా, కొన్ని సంవత్సరాలనుండి విదేశంలోనే ఉంటున్నాం. చదువు పూర్తవగానే, ఉద్యోగంలో చేరిన అక్క, పెళ్ళికొడుకునీ వెతుక్కుని స్థిరపడిపోయిందక్కడే. తనకి ప్రయాస లేకుండా, నేనూ అలాగే చేస్తానని మా అమ్మ ఎదురుచూసి, అటువంటి సూచనలేం కనపించకపోయేసరికి, నన్నే అసమర్థుడి కింద జమకట్టి నిట్టూరుస్తూ "కన్నవాళ్ళం మాకు తప్పదుగా, రంగంలోకి దిగాల్సిందే" అనేసింది.

'నువ్వే కావా'లంటూ ఏ అమ్మాయీ నా వెంటపడి వేధించలేదు... 'నీవు లేక నేను లేను' అనిపించేంతగా ఏ అమ్మాయీ నన్నాకట్టుకోలేదు. ఇందులో నా తప్పేం ఉందీ..?' ఇలాంటి పరిస్థితుల్లో పెద్దవాళ్ళకే ఆ పని భారం అప్పగించక తప్పదుగా. 'పెద్దవాళ్ళ మీదే భారం పెట్టాడు, మావాడెంత బుద్ధిమంతుడో..!' అని సంతోషించకుండా నన్ను నిందించటంలో ఏం న్యాయం ఉందో మీరే చెప్పండి? పెద్దవాళ్ళు ఎప్పుడు ఎలా మాట్లాడతారో ఊహించలేమన్నది మాత్రం నిజమనిపించింది.


కార్యరంగంలోకి దిగాకగానీ... మా అంచనాలూ అభిరుచులకి తగ్గ అమ్మాయి దొరకటం ఎంత కష్టమో అర్థంకాలేదు. దాంతో, 'మన దేశంలో అయితే ఈ సమస్య చిటికెలో తేలిపోతుం'దని అమ్మ తేల్చి చెప్పగానే, మేం కూడా ఆ మాటను గౌరవంతో శిరసావహించినట్టుగా రెక్కల విమానంలో ఇక్కడ వాలిపోయాం.

నిజం చెప్పాలంటే... మా నాన్నకి స్వదేశంలో ఏదైనా వ్యాపారాన్ని వెలగబెడుతూ దర్జాగా జీవించెయ్యాలనే కోరిక ఉంది. అమ్మకు కూడా అంతే... బంధుమిత్రులందరిళ్ళల్లో జరిగే శుభకార్యాలకు హాజరవుతూ సందడిగా రోజులు లాగించెయ్యాలనే సరదా ఎక్కువ. ఇక నా సంగతీ అంతేనండీ... ఎక్కువగా భారంలేని తేలికైన ఉద్యోగం చూసుకుని స్నేహ బృందంతో కోలాహలంగా [illegible]నే ఆలోచన అంతర్గతంగా ఉంది. అందుకే మా అమ్మ మాటను కాదనకుండా ఇష్టంగా అంగీకరించేశాం.

ఇక్కడకు వచ్చాక, కార్యరంగంలోకి దిగాక, పరిస్థితులు ప్రపంచమంతా ఇంచుమించుగా ఒకేలా ఉన్నాయన్న నగ్నసత్యం అమ్మకి అర్థమై... అదంత తేలికైన వ్యవహారం కాదని గ్రహించి, ప్రయత్నాలను ముమ్మరం చేసింది.

నేనొకసారి సరదాగా 'కోడలి కోసం అంత ఆత్రుత ఎందుకమ్మా?' అనడిగా. మా అమ్మ తక్కువేం కాదుగా, 'కోడల్ని కాల్చుకు తినే కార్యక్రమం రంజుగా ఉంటుందని ఈ మధ్యనే ఎక్కడో చదివారా... అందుకూ' అని సమాధానం చెప్పింది. 'ఈ రోజుల్నిబట్టి అలా జరిగే అవకాశం ఒక్క శాతం కూడా లేదనిపిస్తోందమ్మా. పైగా కోడలి వేధింపులతో నువ్వే కాగిన నూనెలో వేగిపోవాల్సి వస్తుందేమో' అన్నా భయం నటిస్తూ. మా అమ్మ కూడా 'అవునా... ఇలాంటి ఆలోచనే రాలేదూ... ఇక కోడలి ప్రసక్తే తీసుకురాను' అనేసింది. 'సమస్యల్ని చాకచక్యంతో ఎదుర్కోవాలి గానీ అలా అస్త్ర సన్యాసం చేసినట్టు మాట్లాడటం నీకు తగదమ్మా... ప్రయాస పడకుండా ప్రయత్నాల్ని నిదానంగానే సాగించు' అంటూ బోధ చేశాను బతిమాలుకుంటున్నట్టు. అమ్మ కూడా ఇక నవ్వేసి, ఆ తర్వాత నిట్టూర్చింది. 'పనులేం చకచకా సాగటంలేదులే... నిదానంగానే ఉన్నాయి. నేను చేసిన దానాలేం గొప్పవి కావు కాబోలు... దానంకొద్దీ కోడలని అన్నారుగా' అంది. మా అమ్మ తనకు అనుగుణంగా సామెతల్ని కూడా మార్చేసుకోగలదు- అంతటి చాకచక్యం ఉంది మరి.

ఇలా మేం... మా ప్రయత్నాలేవీ ఫలించక విసిగి వేసారిపోతుంటే... అదేమీ గమనించకుండా మా అక్క- మేం అంతా కబుర్లు చెప్పుకునే సమయంలో...



ఫోన్‌లో తన గళమూ కలుపుతూ ఉంటుందిగా, 'ఏదైనా మంచి కబురు చెబుతారేమోనని ఎదురుచూస్తుంటే, ఏమీ చెప్పరేం?' అంటూ కసురుకోవటం ఒకటీ..! చిరాకొచ్చి ఫోన్ తీయకపోతుంటే... 'నోరు మూసుక్కూర్చున్నారేం?' అంటూ నోరు పారేసుకుంటోంది. పిల్లాడి పెళ్ళి అనేది ఎంత కష్టమో మాకు తెలిసొచ్చింది.

ఇలాంటి తరుణంలో... ఊరు వెళ్ళొచ్చిన మా నాన్న తెచ్చిన కబురొకటి మా ఆశలకు ఊపిరిపోసింది.

ఈ సుదీర్ఘ ఉపోద్ఘాతానికి ముగింపు చెప్పేసి, అసలు కథలోకి వచ్చేస్తున్నాలెండి. మొన్ననే... మా నాన్నకి తన చిన్ననాటి స్నేహితుడొకాయన అనారోగ్యంతో మంచం మీద ఉన్నారనే వార్త తెలిసింది. వెంటనే ఆ స్నేహితుడిని చూసి వస్తానంటూ ఆ ఊరికి వెళ్ళొచ్చారు.

ఎక్కడికైనా వెళ్ళి వస్తే... మా అమ్మ యక్ష ప్రశ్నల పరంపరతో, మా నాన్న జవాబుల రూపంలో చెప్పే సమాచారాన్ని సేకరిస్తుంది. ఈసారి ఆ అలవాటుకు విరుద్ధంగా మా నాన్నే ఉత్సాహంగా వివరాలను మొదలుపెట్టారు. ఆ స్నేహితుడి కూతురు... చక్కని చిరునవ్వు, మంచి మాటతీరుతో ఎలా ఆకట్టుకుందో వివరంగా చెబుతూంటే... అమ్మ "మీరెళ్ళింది, మీ ఫ్రెండ్‌కి బాగాలేదని చూడటానికి కదా... అది చెప్పకుండా..." అంటూ ఆశ్చర్యంగా చూసింది.

'వాడికేం బాగానే ఉన్నాడు. ఆర్థిక పరిస్థితి పరవాలేదు కాబట్టి సాయానికి ఓ మనిషిని పెట్టుకున్నాడు. కుటుంబం అంతా కనిపెట్టుకుని చూస్తుంది కాబట్టి ధైర్యంగా ఉన్నాడు. అతని కూతురు ఈ మధ్యనే ఏదో ఉద్యోగంలో చేరిందట. తండ్రికిలాంటి అనారోగ్యం కలగడంతో 'ఉంటే ఉంటుంది, లేకపోతే లేదు' అనుకుంటూ సెలవు పెట్టేసి, దగ్గరే ఉండి జాగ్రత్తగా చూసుకుంటోంది.

ఆ అమ్మాయి రూపురేఖలే కాదు, అంతరంగమూ అంత అందమైనదేనని అక్కడున్న కాసేపటిలోనే అర్థమైపోయిందంటూ మళ్ళీ మునుపటి రూటులోకి వెళ్ళిపోయారు నాన్న.

అమ్మా, నేనూ చెవులప్పగించి ఆశ్చర్యంగా వింటూండిపోయాం.

'తల్లిలా బుజ్జగిస్తూ అన్నం తినిపించటం... స్నేహితురాలిలా కబుర్లు చెబుతూ కలిసి టీవీ ప్రోగ్రాములు



చూడటం... డాక్టరులా మందుల గురించి మాట్లాడుతూనే ధైర్యాన్ని నూరిపోయటం... ఇవన్నీ తన వ్యక్తిత్వాన్ని అద్దంలా తెలియజేశాయి' అంటూ నాన్న ఇంకొక సంఘటనా చెప్పుకొచ్చారు.

ఆ ముందు రోజు వాళ్ళంతా టీవీలో ఒక సినిమా చూశారట. అందులో ఒక రంగస్థల నటుడు భార్య వియోగాన్నీ ఒంటరితనాన్నీ భరించలేక, తన సహచర నటుడైన స్నేహితుడిని బాధ నుండి విముక్తి ప్రసాదించమని దీనంగా కోరటం... ఆ స్నేహితుడు తరువాత బాధపడినాగానీ, అప్పుడు గుండె దిటవు చేసుకుని నిద్రమాత్రలు ఇచ్చి, మరణానికి సహకరించటం... జరుగుతుంది.

ఆ సన్నివేశ స్ఫూర్తితోనో ఏమోగానీ, మరునాడు మావాడు కూతురిని తనకూ అలాంటి విముక్తి ప్రసాదించవచ్చు కదా అని అడిగాడట. మంచం మీద కదలలేని నిస్సహాయత ఆ కోరికను కలిగించి ఉండొచ్చు. ఆ అమ్మాయికి ఆ సినిమాలో అస్సలు నచ్చని సన్నివేశమే అది.

ఆ విషయం తెలియజేస్తూ- ఆ రాత్రే ఆవేశంతో ఆ దర్శకుడికి ఒక ఉత్తరం కూడా రాసేసిందట. తండ్రి కోరికను విన్న వెంటనే కోపంతోనూ బాధతోనూ కన్నీళ్ళు పెట్టుకుని ఆ ఉత్తరాన్ని తండ్రికి చూపించింది. 'మన ఇంట్లో ఇంకెవరికైనా ఇలాంటి అనారోగ్య సమస్య ఏర్పడితే... పరిష్కార మార్గంగా మీరు ఇదే చెబుతారా..?' అని కూడా ప్రశ్నించింది.

ఆ ఉత్తరం చదవటం పూర్తిచేసిన ఆయన 'తప్పుగా మాట్లాడాను. నా మాటల్ని వాపసు తీసుకుంటున్నా'నంటూ కూతుర్ని అనునయించటమూ జరిగింది. ఇదంతా ఆయనే మా నాన్నకు చెప్పి ఆ ఉత్తరాన్ని సరదాగా చదవమని చూపించారట. 'ఈ ఉత్తరాన్ని పోస్ట్ చేస్తే, ఆ దర్శకుడు చదువుతారో, మానతారో తెలియదుగానీ మనకు తెలిసిన పదిమంది మధ్యా ఈ విషయం లేవనెత్తి, చర్చకు పెడితే బావుంటుందని చెప్పి వాళ్ళ అనుమతితోనే ఆ ఉత్తరాన్ని వెంట తెచ్చా'నంటూ మమ్మల్ని చదవమన్నారు మా నాన్న.

అప్పుడు ఇంకోమాట చెప్పారు... సాగనంపుతూ ఇంటి బయటకు వచ్చిన ఆ అమ్మాయితో- తను తండ్రిని శ్రద్ధగా చూసుకుంటున్న తీరు నచ్చిందని చెప్పారట. దానికా అమ్మాయి 'ఈ మాట చాలామంది నాతో అన్నారండీ. నాకాశ్చర్యం కలిగించే విషయం ఏమిటంటే... కొండంత ప్రేమాభిమానాలను పంచుతూ పెంచి పెద్ద చేసిన తండ్రికి... అవసర సమయంలో ఈ కొంచెం చేయగలగటాన్ని గొప్పగా అనుకోవటం తప్పే కదండీ... ఎవరైనా బయటవాళ్ళకు నేనిలా చేయగలిగితే మాత్రం... అది తప్పకుండా మెచ్చుకోదగ్గ విషయమేనని నాకూ అనిపిస్తుంది' అంటూ జవాబు చెప్పేసరికి ఇంకా ముచ్చటపడి పోయారట. 'ఉత్తరం చదివాక ఆ అమ్మాయి ఆశావాద దృక్పథం ఎలాంటిదో మీకూ తెలుస్తుంద'నీ చెప్పారు నాన్న.


కలం కదిలించండి

సృజనాత్మకత కలిగిన రచయితలకూ రచయిత్రులకూ ఇదే ఆహ్వానం. మానవ జీవితంలోని విభిన్న పార్శ్వాలను స్పృశిస్తూ మధురమైన అనుభూతులను పాఠకులకు పంచే కథలకు 'ఈనాడు' స్వాగతం పలుకుతోంది. భావం ఏదైనా... కథనంలో వైవిధ్యం, పాఠకులను ఏకబిగిన చదివించగలిగే బిగువూ ఉండాలి. ఆశావహ దృక్పథంతో సాగే కథలకు ప్రాధాన్యం. కథ సాధారణ చేతి రాతలో ఏడు అరఠావులకు మించకూడదు.

కథలు పంపాల్సిన చిరునామా

ఆదివారం అనుబంధం

రామోజీ ఫిలింసిటీ,
అనాజ్‌పూర్,
అబ్దుల్లాపూర్‌మెట్ (మం),
రంగారెడ్డి జిల్లా,
తెలంగాణ-501 512.

కథలను sunday@eenadu.net కు మెయిల్ చేయవచ్చు కూడా.

మేమిద్దరం ఆ ఉత్తరం చదివాక అమ్మ 'ఏ విషయంగా ఆ అమ్మాయి మీకంతగా నచ్చిందో అర్థమైంది. నేనూ నూటికి నూరు మార్కులూ వేసేస్తున్నా' అంటూ ఆనందంగా ప్రకటించేసింది.

నేను కొంచెం సంశయంగా చూస్తూ అమ్మతో అన్నాను- 'ఆ అమ్మాయి తనకెంతో ఇష్టమైన తండ్రికి చేయగలుగుతున్నాననీ, ఇంకెవరికీ అలా చేయలేననీ చెప్పటం విన్నావుగా... మనకి అలాంటి సేవలు అందిస్తుందని భ్రమపడటంలేదుగా!'

అమ్మ చిన్నగా నవ్వింది. 'తల్లిదండ్రులతో సమానంగా ప్రేమాభిమానాలను అందించాలని కోరుకోవటం అత్యాశేనని నాకు తెలుసు కదా... అలా ఎందుకనుకుంటానూ. అయితే, ముందు మనం ఇచ్చిన ఆదరాభిమానాలను పుచ్చుకుని తిరిగి ఇవ్వటంలో నిర్లక్ష్యం చూపించే రకం కాదనీ, ఇచ్చిపుచ్చుకునే సంస్కారం ఉన్న అమ్మాయనీ అర్థమై నచ్చిందంటున్నా' నంటూ వివరణ ఇచ్చింది.

ఒక పిట్టకథలా ఉన్న ఈ ఉత్తరంలో మరో ఉత్తరం గురించిన ఉదంతమూ చెబుతాను. ఆ ఉత్తరంలో... ఒక మంచి సినిమా తీసినందుకు దర్శక నిర్మాతలిద్దరికీ ప్రశంసలు ఉన్నాయి. తర్వాత... పెద్దవాళ్ళయిన పిల్లలు తమ దగ్గరకు వచ్చిన పెద్దలతో వాళ్ళ మనసులు గాయపడని విధంగా ఎంత సున్నితంగా వ్యవహరించాలో పరోక్షంగా తెలియజేస్తూ... పెద్దవాళ్ళు కూడా పిల్లల వ్యవహారాలలో తలదూర్చి లేనిపోని తలనొప్పుల సమస్యలు తెచ్చుకోకుండా, కేవలం సలహాలు మాత్రమే ఇచ్చి ఊరుకోవటం గౌరవంగా ఉంటుందనే సందేశం లాంటి హెచ్చరికా నచ్చిన విషయంగా పేర్కొనటం జరిగింది.

ఆ తరువాత... పిల్లల దగ్గర్నుండి పల్లెకు బయలుదేరిన పెద్దవాళ్ళిద్దరూ... నాలుగు మొక్కలున్న చిన్న ఇంటిలో... అన్ని పనులూ అరమరికలు లేకుండా కలిసి చేసుకుంటూ కబుర్లతో సరదాగా కాలక్షేపం చేయటం... సాయంకాలాలు పొలం గట్లపైకి షికారుగా వెళ్ళివస్తూ... దారిలో కనిపించిన బంధు మిత్రులను ఆత్మీయంగా పలకరించటం... అప్పుడప్పుడూ వచ్చి పోయే పిల్లలతో... దూరమై దగ్గరయ్యే ఆనందాన్ని అనుభవించటం... చూసి ముచ్చటపడుతూనే ఇలాంటి సన్నివేశాలు ఇంకెన్ని చూస్తామని ఆశపడుతూంటే...

అనుకోని విధంగా వాళ్ళను విడదీసి... మా కళ్ళను కన్నీటి కాల్వలుగా మార్చేశారు. ఏం చేస్తాం, ఒక్కోసారి విధి వైపరీత్యాలుగా అలానూ జరుగుతూంటా యని సరిపెట్టుకుని గుండె బరువుని తట్టుకున్నాం అని చెబుతూ చివరగా అస్సలు నచ్చని సన్నివేశ విషయ ప్రస్తావనా చేసింది. 'భరించలేని బాధతో విముక్తి కోరిన స్నేహితుడికి... ఎన్నో మార్గాల ద్వారా సేదతీరే అవకాశం ఉందని నచ్చచెప్పాల్సిందిపోయి... మరణమే విముక్తి మార్గమని చెప్పినట్టుగా అలా చేయటం సమంజసంగా లేదు... పైగా పరోక్షంగా తప్పుదారిని సూచించినట్టుగానూ ఉంది. మూలకథలో అలా ఉన్నా, మార్పు చేస్తే బావుండేది కదా..!



వాళ్ళిద్దరూ కొన్నాళ్ళు ఆ స్నేహితుడితో ఉండి... గత అనుభవాలను అంతకు ముందులా పద్యాలూ సంభాషణల రూపంలో నెమరేసుకుంటూ సరదాగా కాలక్షేపం చేస్తూ స్నేహితుడి దుఃఖాన్ని తగ్గించే ప్రయత్నం చేయచ్చుగా..? లేకపోతే, అతనే తన ఇంటిలో తనలాంటి ఒంటరివాళ్ళు నలుగురికి ఆశ్రయమిచ్చి... అందరూ కలిసి పనులు చేసుకుంటూ కాలం గడిపినా బావుండేదిగా..? పోనీ... ఓ పది మందిని శిష్యులుగా స్వీకరించి తన నటనానుభవాలనూ మెలకువలనూ నేర్పించటమూ మంచి కాలక్షేపంగా ఉంటుంది కదా... లేదూ తన అనుభవాలను గ్రంథస్థం చేయటమూ మంచి ప్రయత్నంగా ఉండదా..? ఇలాంటి ఏదో ఒక మార్గాన్ని సూచించి ఉంటే బావుండేదని నా అభిప్రాయం' అంటూ తెలియజేసింది.

ఆ ఉత్తరం చదివాక అమ్మ నీ సంగతేమిటంటూ నావైపు చూసింది. నా అభిప్రాయం కోసమని అర్థమైంది. 'వృద్ధాప్యంలోనూ ఆనందంగా జీవించవచ్చని తెలియజేసిన తీరులోని భావుకత నాకూ బాగా నచ్చింది' అని చెప్పేశాను.

ఇదండీ విషయం. ఆ అమ్మాయి ఎవరో, నేనెందుకు ఈ ఉత్తరం రాస్తున్నానో అన్నీ మీకు అర్థమైపోయి ఉంటాయి.

అప్పటి పరిస్థితినిబట్టి ఈ విషయం కదపటం బావుండదనీ, ఆ పైన అందరి అభిప్రాయాలూ ముందుగా తెలుసుకోవాలనే ఆలోచనతోనూ ఆ పని చేయలేదని చెప్పిన మా నాన్న మీ అభిప్రాయాన్ని తెలుసుకోవాల్సిన బాధ్యతను నాకప్పగించారు. దాని ఫలితమే ఈ ఉత్తరం!

ఇది కేవలం ఉత్తరం మాత్రమే కాదండోయ్... కాబోయే యజమానురాలిగా, మా ఇంటి ఆధిపత్యాన్ని స్వీకరించమని మా కుటుంబసభ్యులందరి ఆమోదముద్రతో మీకు అందజేస్తున్న అభ్యర్థన పత్రం.

మీ అనుమతి లభిస్తే... 'నా' అనే అక్షరం పక్కన ఉన్న ఖాళీలో... కాబోయే జీవన సహచరీ అనో, జీవితంలోకి నిత్య వసంతాన్ని వెంటబెట్టుకు వచ్చే వాసంతీ అనో తదుపరి లేఖలో రాయవచ్చు. ఏ కారణంగానైనా మా ప్రతిపాదనను తిరస్కరిస్తే... కనీసం స్నేహాన్నయినా కొనసాగించమని నా అభ్యర్థన. మీ వాళ్ళందరితో పరిచయం కలిగించుకోవటానికి వచ్చేవారం మేమంతా మీ ఊరికి వస్తున్నాం. మా వసతీ వగైరాలు మేమే ఏర్పాటు చేసుకుంటున్నాంలెండి.

సూటిగా అసలు విషయమే కాకుండా, ఇం..త సొద ఎందుకు రాయాల్సి వచ్చిందో కూడా చెప్పనా..? మా ఇంట్లో వాళ్ళందరి మనోభావాలూ, మా ఇంటి వాతావరణం... ఎలా ఉంటాయో మీకు కొంచెంగానైనా అవగాహన కలిగిద్దామనే అభిప్రాయంతో మాత్రమే.

ఆఖరుగా ఒక విషయం... ఈ ఉత్తరంలోని మొదటి, చివరి అక్షరాలు రెండూ కలిపితే, మావాళ్ళు నన్ను పిలిచే వాడుక నామం అవుతుంది. ఇక మీ నిర్ణయం తెలుసుకున్నాక 'నీ' అనే అక్షరం పక్కన నా సంతకం తీరూ మారుతుందని తెలియజేస్తూ ముగిస్తున్నానండీ!

నీ

... ... ...